# అపరిచిత

## శ్రీనివాసరాజు

మంచిర్యాల్లో టీ బ్రేక్‌కి బస్సాపాడు డ్రయివర్. బస్సుదిగి ఎదురుగా కన్పిస్తోన్న క్యాంటీన్‌లో 'టీ' తాగి సిగరెట్ ముట్టించి పొగని గుండెల నిండా పీల్చి రిలాక్స్‌డ్‌గా ఫీలయ్యాడు పార్థసారధి. ఆసీఫాబాదు నుండీ వస్తున్నాడతను. అక్కడి ఓ సిమెంట్ కంపెనీ కాన్ఫరెన్స్‌లో పాల్గొని తిరిగి బ్రాంచి ఆఫీసుకి హైదరాబాదు వెళ్తున్నాడు. నాలుగో పఫ్ సగంలోనే డ్రయివరు బసెక్కి హారన్ కొట్టడంతో సిగరెట్‌ని నార్త్‌స్టార్ కింద నలిపి బస్సెక్కాడు. అతను ఫుట్‌బోర్డు మీద కాలు పెడ్తూ తన సీటు వైపు చూసి ఆశ్చర్యపోయాడు. కన్ను కెమెరా కొట్టిన ఫ్లాష్‌ని గుండె రిసీవ్ చేసుకొని ఓక్షణం తర్వాత లయ తప్పింది. ప్రక్కసీట్లో తన ఇంగ్లీషు మాగ్‌జైన్ని తిరగేస్తూ ఓ పద్దెనిమిదేళ్ళ అమ్మాయి ..."

"ఆపు...!" గట్టిగా అరిచాడు పురుషోత్తం. చెప్పడం ఆపి గాలి పీల్చుకొన్నాను. అక్కడ గాలిలో కూడా కాసేపు స్తబ్దత ఏర్పడింది. దూరంగా డెక్‌లో స్టీవీవండర్ 'ఐ జస్ట్ టు కాల్ ఐ లవ్ యూ..' పాప్ సాంగ్ మంద్రస్థాయిలో వినవస్తూ ఉంది. నీలి రంగు విద్యుత్ కాంతి మా వంటి మీద పడి జార్తోంది. అక్కడి వాతావరణం చుట్టూ మసక తెరలు కట్టినట్లుగా ఉంది. తలెత్తి అతని వేపు చూసాను. తాగుతున్న 'జిన్'లో మరికాసింత 'లిమ్కా' ని కలిపి గటగటా తాగి గ్లాసు కింద పెడ్తూ అన్నాడు.

"బస్సుల్లోనో, రైళ్ళలోనో ఒంటరి ప్రయాణాలూ, ప్రక్క సీట్లో అపరిచితురాలైన అమ్మాయి, రాత్రి పూట చీకటి తాలూకు అనుభవాల గుర్తులు, సరసాలు, సల్లాపాలూ, సరదాలు, చివరకు దిగిపోయేటప్పుడు ఆమె 'పర్సనాలిటీ' కి గుర్తుగా 'పర్సనాలిటీ' పోగొట్టుకోవడం, లేదా, బ్రీఫ్ కేసుతో అమ్మాయి పరారీ, ఇంకా కాస్త ముందుకెళ్తే ఆ అమ్మాయి నుండీ ఏదైనా రోగం లాంటిది పంచుకోవడం — అంతేనా ఛీ.. ఛీ... కథకు కల్పన ఉండాలి. ఒప్పుకొంటాను. కానీ, పాఠకులు చదవుతున్నారు కదాని మీరు ఇలాగే వ్రాస్తూ పోతారా? ఇక మారరా? ఈ రకం పంథాని మార్చుకోరా ..? మార్చి వ్రాయరా..? కోపంగా అన్నాడు.

చాలా మాట్లాడ్డం వల్ల ఆయాసం వస్తోంది. గుండెలు ఎగిసి పడ్తున్నాయి. 'జిన్ పని చెయ్యడం ప్రారంభించిందా?' మనసులోఅనుకొన్నాను. నేను వ్రాసే ప్రతి కథనీ మొదట బాగా విమర్శిస్తాడు. అదేం చిత్రమో గానీ అతను విమర్శించేది నేను వ్రాస్తే తప్పక 'క్లిక్' అయి తీరుతుంది. అది నా గట్టి నమ్మకం. ఇప్పుడు అదే మొదలయిందిక్కడ.

కథ పూర్తి చేస్తూ ఎండింగ్‌లు పూర్తిస్థాయి కిక్‌ని తెప్పిస్తానతనికి. ఆ నగ్న సత్యాన్ని రుజువు చెయ్యాలనిపించింది — మళ్ళీ ఓసారి.



"ప్రతీ వాస్తవానికీ కాస్తంత ఫిక్షన్ జోడిస్తేనే కదా అది కథయి చదివిస్తుంది ఉత్తం" అన్నాను.

అతను మౌనంగా ఉండిపోయాడు — ఏమీ మాట్లాడకుండా గ్లాసులో మిగిలి ఉన్న విస్కీ గొంతులో పోసుకొన్నాను. మేము బార్లో కల్సినప్పుడల్లా తదుపరి నేను వ్రాయబోయే ప్రతి కథ గురించీ అతన్తో డీల్ చెయ్యడం నా కలవాటు. నా ప్రతి రచనకూ మొదటి పాఠకుడు అతనే. అతని విమర్శతో మరింత స్ఫూర్తిపొంది వ్రాస్తానంటే పునరుక్తి అవుతుందేమో?

"ఫిక్షన్ లేకుండా నాలుగేళ్ళ క్రితం నా జీవితంలో ఎదురైన ఓ అరుదైన సంఘటన చెప్తాను వింటావా?" గ్లాసు కింద పెడ్తూ అన్నాను. అతను తలూపి, పెదవుల కంటిన తడిని చేత్తో తుడ్చుకొని వెనక్కు వాలాడు.

** ** **

శీతకాలం రాత్రిపూట కావడంతోచలిగాలి రివ్వున వీస్తోంది. ఆకాశంలోనక్షత్రాలన్నీ కలసి కట్టుగా అష్టా చెమ్మ ఆటకు ఎటో వెళ్ళాయి. చేస్తోన్న పార్ట్‌టైమ్ ఉద్యోగం మీద విసుగొచ్చిన చందురుడు మబ్బుల చాటుకెళ్ళాడు. వాచీ చూసాను. డయల్ మీద చిన్నది 'పది' తో ముచ్చటిస్తోంది. పదిహేను నిముషాల క్రితం రావల్సిన హైదరాబాద్ సూపర్ డీలక్స్ ఇంకా రాలేదు. చలి ఎక్కువగా అన్పించడంతో బ్రీఫ్‌కేసు తెరచి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్‌పై నున్న ఆఫ్ హేండ్స్ స్వెట్టర్ని బయటకు తీసి తొడుక్కొన్నాను. కాస్త వెచ్చగా అనిపించింది. టీ తాగాలన్న కోరికను అతి కష్టంగా చంపుకొన్నాను. ఆర్నెళ్ళ క్రితమే ఈ ఊరు వచ్చాను. మళ్ళీ ట్రాన్స్‌ఫర్ ఆర్డరుతో మరోఊరు.

పక్కనే మూసి ఉన్న పూల కొట్లోంచి మధురమైన వాసన ఆగి ఆగి వస్తోంది. దూరంగా కిరోసిన్ లాంతరు పెట్టుకొని ఓ టీ స్టాలు. టైమ్ అయిపోవడంతో గ్లాసులు కడిగిన నీళ్ళ బకెట్‌ని రోడ్డు కడ్డంగా కుమ్మరిస్తున్నాడో ముసలతను. పల్చగా ఉన్న కొద్దిపాటి జనం ప్రయాణీకుల కోసం వేసిన చెక్కబల్లల పై నిద్రాదేవిని కౌగలించుకొని ఉన్నారు. కాస్త దూరంలో ఎంక్వయిరీ కౌంటర్. దాని ప్రక్కగా కుర్రాళ్ళ గుంపొకటి. వాళ్ళలో వాళ్ళు ఒకరి మీద మరొకరు కామెంట్

చేసుకొని త్రుళ్ళుతున్నారు. వాళ్ళంతా 'వాలీబాల్' టోర్నమెంట్స్‌కి వెళ్తున్నట్లు వాళ్ళ మాటల్ని బట్టి తెలుస్తోంది. వాళ్ళు ఎక్కాల్సి ఉన్న 'నెల్లూరు' ఎక్స్‌ప్రెస్ ఆ రోజుకూడా ఆలస్యమే.

సాయం సంధ్యలో అస్తమిస్తున్న సూరీడు ఓ వెండి కిరణాన్ని ప్రకృతి మధ్య మర్చి వెళ్లాడేమో! ఆ రాత్రి మా కళ్ళ ముందు ఒక్కసారి ఆ కిరణం మెరిసి నట్లయింది. రిక్షా దిగిన ఓ పద్దెనిమిదేళ్ళ వెండి తీగ నడుముకొంటూ ఎంక్వయిరీ కౌంటర్ వైపురావడంతో అక్కడి మగకళ్ళన్నీ తమకున్న ఎక్స్ రే చూపుల్ని ఆమె వైపు ఎక్కుపెట్టాయి.

"ఎక్స్‌క్యూజ్ మీ... హైదరాబాద్ కెళ్ళాల్సిన సూపర్ డీలక్స్.." ఆమె మాటలు పూర్తి కాలేదు. కౌంటర్‌లో కూర్చున్న వ్యక్తి చదువుతున్న సెక్స్ మేగ్‌జైన్‌న్ని పక్కన పెట్టి ఇకిలిస్తూ....

ఏమిటి .. మీరు హైదరాబాదే .. పది నిముషాల క్రిందే రావాల్సింది. ఇంకా రాలేదు" వచ్చింది వంటరిగా ఉన్న అమ్మాయని తెలియడంతో వెకిలిగా మాట్లాడాడు.

కాస్త ఎడంగా నిలబడి సిగరెట్‌ని మసి చేస్తోన్న కారాకిళ్లీ డ్రయివర్ బాబు చెవిలో కుర్ర కండక్టర్ ఏదో చెప్పడం, ఆ శిష్యోత్తముడు 'కట్' చేసిన జోక్‌కి డబ్బాలో రాళ్ళేసి ఆడించినట్లు నవ్వాడతను.

ఇందాకటి కుర్రాళ్ళదృష్టి ఇప్పుడామె మీదకు మళ్ళింది. వారి కామెంట్ల గాలి ఈ సారి ఇటువైపు వీయసాగింది.

"వారి బుద్ధీ కోతి బుద్ధీ ఒక్కటేనట్రా?"

"ఎలా ? నీకెలా తెల్సు?"

"ఇంట్లో మన్మధుడు లాంటి భర్త ఉన్నా, వీధిలో బిచ్చగాడ్ని కోరుకుంటుందిట ఆడది. మొన్నో నాటికలో విన్నాను."

"ఆ విషయం వీడికి తెలిసే విన్నెందుకు కడుగుతాడు!"

"మొన్నీ మధ్య ఓ షూటింగ్‌లో ఓ హిందీ హీరోయిన్ స్విమ్మింగ్ డ్రెస్‌లో తన 'థర్టీసిక్స్' దగ్గర హుక్ ఊడిపోతే అలాగే షూట్ చేసాడట ఆ డైరెక్టర్ తర్వాత ఆ నటి ఒకటేగొడవ.

'స్టుపెడ్స్" మనసులో కసిగా తిట్టుకొన్నాను. ఓ అమ్మాయి వంటరిగా కన్పించిందంటే చాలు ఛీప్ కామెంట్స్‌కీ, వల్గర్ టాకింగ్ కీ హద్దుండదు. ఆ స్థితిలో తన తల్లినో, చెల్లినో అస్సలు ఊహించలేరు. వాళ్ళ దృష్టిలో వాళ్ళు ఇళ్ళుదాటి బయటకురారు. ఓ వేళగడప దాటి బయటికి వచ్చిన జనం మధ్య చాలా పవిత్రంగా చూడబడతారు అంతెందుకు ,,? ఇంటికొచ్చే స్నేహితులని సిస్టర్ అనో, సిస్టర్ ఇన్ లా అనో ఇంకా అనుకూలమైన వరుసలతో పిలిపించేసి, సెంటిమెంట్ల ముసుగులో తృప్తిగా గాలి పీల్చుకొంటూరు. వాటిని దాటి కాసింత దూరం కూడా రాలేరు.

ఆమె .మొహంలోని ముగ్ధత్వం, దానికి తోడు కాసింత బిడియం,కొట్టుకొచ్చినట్లు కనిపించేలమాయకత్వం, ఓ ప్రక్కన అసహాయతా, మెతక భావంతో పాటు జంకూ ... ఇవన్నీ కలసి ఆ కుర్రాళ్ళలో కాస్త ధైర్యం కల్గించింది. తలొంచుకొని క్రిందకు మౌనంగా చూస్తుండిపోవడంతో ఓ కుర్రాడు ధైర్యం చేసి ఆ అమ్మాయి వైపువచ్చాడు. ఆ వచ్చీ రావడంతో ఆమె రెండు చెంపల్నీ చేతుల్లోకి తీసుకొని మొహం మీదకు వంగాడు.

ఈ హఠాత్ పరిణామానికి ఆమె లేడి పిల్లలా బెదిరిపోయింది. చిగురుటాకులా వణికి పోయింది. పరిస్థితి విషమిస్తోందనిపించింది. రెండడుగుల్లో ఆమె దగ్గరకు చేరుకొని మొహం మీదకు వంగుతోన్న ఆ కుర్రాడి కాలర్ పట్టుకొని వెనక్కు లాగాను. అలా లాగడంతో దవడ పేలిపోయేలా ఫెడేల్‌మని కొట్టాను. బహుశా నన్నూహించని అతను తేరుకొనే లోపల అంతదూరం ఎగిరి పడ్డాడు.

అంత వరకు ఆ వినోదాన్ని తిలకిస్తున్న మిగతా మగరాయుళ్ళంతా నా వైపు అదోలా చూడ్డం మొదలెట్టారు. నా రంగ ప్రవేశంతో ఊపిరి బిగపట్టి తమాషా చూస్తున్న మిగిలిన కుర్రాళ్ళలో చలనం వచ్చింది. వాళ్ళంతా ముందుకు వచ్చారు.

జేబునుంచి ఐడెంటిటీ కార్డు తీసి చూపిస్తూ చెప్పాను

"సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్‌ని. స్టేషన్‌కి ఫోన్ చేసి పదినిముషాల్లో అందర్నీ లాకప్‌లో పడేసి మక్కెలు విరగదీయగల్ను బీకేర్ ఫుల్' కటువుగా అన్నాను.

నా రూపం, నా దర్పం అన్నంత పనీ చేస్తాననిపించిందేమో కాస్త వెనక్కు తగ్గారు. అయినా నాకో సందేహం మాత్రం పీడిస్తోంది. ఎవరీ అమ్మాయి? ఈ రాత్రిపూట వంటరిగా ప్రయాణమేమిటి ఇంటి నుండి పారిపోయి రావడం లేదు కదా? నేనీ అమ్మాయికి సాయపడ్డం ఎంత వరకు సమంజసం? అని

నా ఆలోచనల్ని చెల్లా చెదురుగా చేరిపేస్తూ హైదరాబాదు సూపర్ డీలక్స్ వచ్చి ఆగింది. నేను తేరుకొన్నాను. నా బ్రీఫ్‌కేస్, ఆ అమ్మాయి సూట్‌కేస్ అందుకొని "పదండి" అన్నాను.

ఆమె మౌనంగా నన్ను అనుసరించింది. ఇద్దరం బస్సెక్కాము. బస్సులో జనం ఆట్టే లేరు. కండక్టరు వచ్చినతర్వాత వందనోటు అందిస్తూ

"రెండు హైదరాబాదు' చెప్పాను డబ్బు కోసం ఆమె పర్సు తీయబోయింది.

"పరవాలేదు. ఉంచండి" ఓ టికెట్‌ని ఆమె చేతుల్లో ఉంచి, సున్నితంగా నొక్కి వదిలాను. ఊరి లిమిట్స్ దాటడంతో లైట్లార్పి వేశాడు డ్రయివర్. బస్సులోపలి చీకటి బయట వెన్నెల ప్రపంచంలోకి దూకెయ్యాలని ప్రయత్నిస్తోంది. మబ్బుల చాటు నుండీ బయట పడిన చందురుడు టన్నుల కొద్దీ వెన్నెలని ప్రకృతికాంతపై ఒలుక పోస్తున్నాడు. కిటికీ పక్కగా కూర్చొని ఉన్న ఆమె కురులు గాలికి ముఖం మీద పడి నాట్యం చేస్తున్నాయి. గ్లాస్ డోర్స్‌ని మూస్తూ ఆమె వైపు చూశాను. ఆమె మొఖంలో భావాలు చదవడం కష్టంగా ఉంది.

రెండు నిముషాలు ఆగి చెప్పాను.

"డోంట్ ఫీల్. వాడంత సాహసం చేస్తాడను కోలేదు. ఎంతో ఫాస్ట్‌గా ఉంటున్న ఈ కాలం అమ్మాయిలకి మీరు క్వయిట్ ఆపోజిట్‌గా ఉన్నారు"

మౌనంగా కూర్చుని ఉంది. కంట నీరు పెల్లుబికి చీకట్లో చెక్కిళ్ళ మీద మెరుస్తూ జారింది నా మాటతో.


"ఓకేటేజీ.. అప్పుడప్పుడూ ఇలాంటి అనుకోని సంఘటనలు ప్రతి స్త్రీ జీవితంలో ఎదురవడం సర్వ సాధారణం. అంత మాత్రానికే బెంబేలు పడిపోతే ఎలా? కష్టం, సుఖం ఈ రెండూ ఇంటికి రెండు తలుపుల వంటివి. ఒకటి మూసుకొంటే రెండోది తెరుచుకొంటుంది.దాన్ని గురించి అట్టే ఆలోచించకండి. మర్చిపోయే ప్రయత్నం చెయ్యండి"

అంతకంటే పెద్దమాట లేమీ దొరకలేదు. ఆమె నా కాంప్లెక్స్ నుండీ బయట పడేయను టాపిక్ మార్చాను.

"మీ పేరేంటన్నారూ..? అని ఆగి ఆ .. ఎప్పుడూ నే చెప్పలేదే?" అని మాత్రం అనకండి అన్నాను.

"అపూర్వ" జీరబోయిన గొంతుతో అంది.

"హైదరాబాద్‌లో ఏం చేస్తున్నారు?"



"అక్కడ ఉస్మానియాలో నర్స్ ట్రైయినీని. మొదటి సంవత్సరం"

"మరి రాత్రి 'నంద్యాల'లో ఒక్కరు బయల్దేరా రేంటి? మిమ్మల్ని డ్రాప్ వెయ్యను ఇంట్లో ఎవరూ లేరా?"

"ఊహూ ! నేను 'కడప' నుండీ వస్తున్నాను. నా రూమ్మేటు వనజ నంద్యాల్లో ఉంటుంది. హాలిడేస్ పూర్తయ్యాయి. ఎలాగు తనూ వస్తుంది కాబట్టి ఇద్దరం కలసి వెడదామని దిగాను. మధ్యాహ్నం వనజ ఇంటి కెళ్ళాక తెలిసింది   తనికి రేపు పెళ్ళి చూపులట నన్ను కూడా ఉండి పొమ్మంది కానీ రేపు డ్యూటీ తప్పని సరికావడంతోరాత్రి వాళ్ళింట్లో భోంచేసి రిక్షా తీసుకొని బస్టాండుకి వచ్చాను. తర్వాత విషయం మీకు తెల్సిందే" మళ్ళీ వెక్కిళ్ళ మధ్య ఏడుపు మొదలు పెట్టింది. ఆమె భుజం తట్టి చాలా సేపు ఓదారుస్తూ ఉండిపోయాను. ఆ తర్వాత ఆ ప్రయాణంలో ఎన్నో విషయాల గురించి చెప్తూ పోయాను. కొన్ని జోక్స్ చెప్పాను. దాదాపు రెండు గంటల తర్వాత తేరుకొంది. ఆమెను ఆ ఫీలింగ్ నుండీ బయట పడేయుమ రెండు గంటలు పట్టింది. ఆమె చిర్నవ్వులోని సాన్నిహిత్యం జీవితంలో మర్చిపోలేనేమో అన్పించింది. ఉదయం హైదరాబాద్‌లో దిగి పోతూ మళ్ళీ అలాంటి బస్సు ప్రయాణం జీవితంలో కోరు కోవడం నాకు అతిశయోక్తిలా అన్పించింది.

** ** **

"ఫిక్షన్ లేకుండా చెప్పావు. నిజంగా బావుంది" ఉత్తం అన్నాడు.

"నే చెప్పాగా నాలుగేళ్ళ క్రితం నా జీవితంలో జరిగిన సంఘటన ఇదని"

ఉత్తం ఆఖరి రౌండులో ఉన్నాడు. సీసాలో మిగిలిన జిన్‌ని గ్లాసులో వంచుకొని 'లిమ్కా' సరిపోక పోవడంతో సగం కోసిన నిమ్మకాయని గ్లాసులో పిండి నీళ్ళు కలిపాడు. ఒక్క గుక్కలో గ్లాసందుకొని ఖాళీ చేసి కిందపెట్టాడు. అతని పెదవుల మీద సన్నటి నవ్వు జిన్ చుక్కతోపాటు జారడం గమనించాను. తర్వాత తెరలు తెరలుగా నవ్వాడు. అతికష్టంగా నవ్వుని ఆపు కొంటూ...

"కానీ నాకో అనుమానం గురూ!" అన్నాడు ఆయాసపడ్తూ

"చెప్పు. ఏమిటని?"

"రాత్రిపూట ప్రయాణంలో నీపక్కన వయసులో ఉన్న అమ్మాయి, అందునా చలికాలం, ఒంటరి ప్రయాణం, నిజ జీవితంలో ఎంతటి మగాడైనా మరీ మడికట్టుకొని కూర్చున్నాడంటే నేనొప్పుకోను"

కడుపులో 'విస్కీ' భాస్వరంలా మండింది. నే చెప్పిన దాంట్లో అతనేదోసమ్‌థింగ్ వెతుకు తున్నాడనిపించింది. చాచి లెంపకాయ కొడదామన్న కోరికను బలవంతంగా ఆపుకొన్నాను. ఈడియట్ .. జీవితంలో మళ్ళీ తేరుకోని విధంగా జవాబు చెప్పాలని నిర్ణయించుకొన్నాను.

అందుకే అతన్ని ఇంకాస్త ఊరిస్తూ అన్నాను.

"తెల్లవారుజామున అయిందింటికి నేను దిగిపోను ఆయుక్త   మవుతుంటే ఆమె అంది — "ఈ ప్రయాణాన్ని చిరస్మరణీయం చేస్తూ నాకంటూ గుర్తుగా ఏం మిగిల్చి ఏమిచ్చి వెళ్తారు?" అని ఆమె కళ్ళలోని ఆర్తి నాకు మరింత స్ఫూర్తినిస్తూ ... ఆలోచిస్తుండి పోయాను.

"ఏమిచ్చి వెళ్ళగలను? వెళ్ళగలను? ఏం మిగిల్చి వెళ్ళగలను??

భవిష్యత్తులో ఈ వర్తమానపు గతాన్ని జ్ఞాపకంగా మిగిల్చి వెళ్ళగలను? జేబుకున్న నా ప్రియ మైన కలమా? పాంట్ జేబులోని లెదర్ పర్స్? నా వేలికున్న వెండి ఉంగరం? ఉహూ... వీటన్నింటికీ అతీతమైంది. భాషకందనిదీ, భావానికి అద్దం పట్టేది. స్మృతి తలపుల్లో నా పట్ల అభిమానం పెంపొందించేది..

ఒక్క క్షణం ఆగి ఆమెను దగ్గరకు తీసుకొని 'ముద్దు' పెట్టుకున్నాను.

ఆమె కళ్ళు మూసుకొని తృప్తిగా 'థాంక్స్' అన్న రెండక్షరాల్ని గుండె గదిలో లాక్ చేసుకొని దిగి పోయాను"

అతనిలో హోరు మొదలయింది. మదిలోని ఆలోచనలు అస్తవ్యస్తమై మనస్సుసంద్రాన్ని మధిస్తేభావతరంగాలు బీభత్సంగా ఎగసి, ఎగసి పడ్తున్నాయి. అతనిలో పట్టలేని ఆవేశం గట్టుతెగిన ఉప్పెనలా పొంగింది.

"మరలా చవకబారు సెంటి మెంట్లనీ, కంపుకొట్టే సాంప్రదాయాలనీ, దరిద్రపు కట్టు బాట్లనీ, మగాళ్ళ మీద దండెత్తావ్. మరి నీవు మాత్రం చేసిన ఘనకార్యమేమిటి? ఆ బస్సు ప్రయాణంలో ఆ అమ్మాయిని ముద్దు పెట్టుకోవడం మాత్రం.."

అతని మాట పూర్తవ లేదు

"యూ ఫూల్... నీవు నన్నర్థం చేసుకొన్నది వేరు" కోపంగా అన్నాను. "నేనా అమ్మాయిని ముద్దు పెట్టుకొన్నది ఆమె పెదవులపై కాదు. ఆప్యాయతా, అభిమానం, అనురాగం, ఆత్మీయతల్ని హెచ్చిస్తూ ఆమె నుదిటి పాపిట మీద — పదిహేడేళ్ళ క్రితం కారుయాక్సిడెంట్‌లోపోకుండా నా శ్రీమతి, ఆరేళ్ళ మా పాప 'అర్పిత' బతికుంటే ... ఇచ్చితంగా మా పాపకి ఆ అమ్మాయి వయస్సుండేది"

బేరర్ తెచ్చిన బిల్లు చూపి ప్లేటులో వందనోటు వేసి లేస్తూ చెప్పాను.

## చేతి సంచి



"ఈ చేతి సంచి గురించి చెప్పడమంటే
జ్ఞాపకాల పుటలు తిప్పడమే
అనుభూతుల అరలు వెతకడమే
నాన్నగారితో స్కూలుకి
అమ్మతో కూరగాయలకి
వెళ్లి వచ్చింది ఈ చేతి సంచే
ఇన్నాళ్లుగా చూస్తున్నానా దీన్ని
ఒక్క మాటైనా మాట్లాడదే
నా కష్టమిదంటూ పెదవి విప్పి చెప్పదే
చిలక్కొయ్యలో తలదూర్చి
గోడకు మేను వాల్చి మౌనంగా చూస్తుంటుంది
అక్క పెళ్లికి శుభలేఖలు పంచిన ఈ చేతి సంచే
అమ్మమ్మ తద్దినానికి సరుకులు మోసుకొచ్చింది
నాన్నగారి పెన్షన్ కోసం అరుగులు ఎక్కి దిగింది
అమ్మ ఆరోగ్యం కోసం ఆసుపత్రుల చుట్టూ
తిరిగిందీ ఈ చేతి సంచే
ఇంత సహాయమూ చేసి ప్రతిఫలమేమైనా అడిగిందా?
వయసుపైన పడుతుంది 'రెస్టు' తీసుకోరాదూ' అంటే
నవ్వి ఊరుకుంటుంది
దాన్ని అలా చూస్తూ ఉంటానా
అది నాతో మాట్లాడుతున్నట్లే ఉంటుంది
దాన్ని చేతిలోకి తీసుకుని స్పృశిస్తానా
నన్ను గతంలోకి తీసుకుపోతుంది
చిల్లుపడిన దాని శరీరంలోకి సూదులు గుచ్చుతుంటే
నా మనసు ఎంత విలవిల్లాడిందనీ
కోడలు చేతిలోంచి దాన్ని తీసుకుని, గుండెకు హత్తుకుని
ముద్దుపెట్టుకుంటూ, కన్నీళ్ల వత్తుకుంటూ
చిలక్కొయ్యకి తగిలిస్తూంటే...
'పనికి రానివి ఎక్కువయిపోతున్నాయి ఈ ఇంట్లో'
అన్న కోడలి మాటలు గుండెల్లో గుచ్చుకుని
గుమ్మం దాటిన నేను, నాతో నా చేతి సంచి"

—పతివాడ 'మోహన్' శ్రీనివాసరావు
విశాఖపట్నం